నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి 1

శుక్రవారం 21 జులై 2023

తిమ్మాపూర్ డీవైఎఫ్ఐ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మండలంలోని తిమ్మాపూర్ డీవైఎఫ్ఐ గ్రామ కమిటీని సీపీఐ(ఎం) పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శోభన్, కార్యదర్శిగా శ్రీకాంత్ మరో ముగ్గురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. యువత శాస్త్రీయ, అభ్యుదయ భావాలు కలిగి ఉండాలని, దేశంలో జరుగుతున్న మత రాజకీయాలకు వ్యతిరేకంగా నేటి యువత పోరాడాలన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం డీవైఎఫ్ఐ నాయకులు రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థిని అదృశ్యం



నవతెలంగాణ-రామారెడ్డి

విద్యార్థిని అదృశ్యమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లపల్లికి చెందిన జిర్ల మహేష్ బతుకుదెరువు కోసం భార్యాభర్తలు హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. ఇద్దరు కుమారులు, కూతురు గొల్లపల్లిలో ఉంటున్నారు. కూతురు సాహితీ (18) బుధవారం కామారెడ్డిలోని ఎస్ఆర్‌కే డిగ్రీ కాలేజ్ వెళ్తున్నానని చెప్పి, రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో, చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో అన్న జిర్ల సాయికుమార్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలపై అవగాహన కోసం

ప్రచార రథాలు



ప్రచార రథలను ప్రారంభిస్తున్న కలెక్టర్



ప్రచార రథాలు

- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికలలో పాల్గొనాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన సంచార ప్రచార రథాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో రెండు చొప్పున ప్రచార వాహనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ ఎంతో కీలకమైనందున, ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని హితవు పలికారు. ఈ దిశగా ఓటర్లను చైతన్యపరుస్తూ ఈ.వీ.ఎం, వి.వి.ప్యాట్‌ల గురించి అవగాహన కల్పించేందుకు ప్రచార రథాలు గ్రామగ్రామాన సంచరిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఓ సింహాచలం, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.డీ.ఓ.సిలో మొక్కలు నాటిన కలెక్టర్..

హరితహారం కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం మొక్కలు నాటారు. కార్యాలయం ఆవరణలో అటవీ శాఖ అధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

పచ్చదనం పెంపొందించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణకు హరిత హారం నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ శాఖల తో పాటు అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆయా శాఖలకు కేటాయిం చిన లక్ష్యాలకు అనుగుణంగా నిర్దిత గడువులోపు నాటేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్షాలు అనుకూలిస్తున్నందున విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముసురేసింది

అలుగు పారుతున్న చెరువులు.. పొంగిపొర్లుతున్న వాగులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా గురువారం సైతం తెరపివ్వకుండా వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని చోట్ల పంటపొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరుకుంది.

బోధన్ టౌన్ : గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బోధన్ పట్టణంలోని బెల్లాల్ చెరువు అలుగు పారుతుంది. బెల్లాల్ చెరువు నిండడంతో పట్టణ ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. యువకులు చెరువు వద్ద చేరుకొని అలుగు పారుతున్న చిత్రాలను తమ కెమెరాలలో బంధిస్తున్నారు. చెరువు నీళ్లతో నిండడంతో ఇక తాగునీటి ఇబ్బందులు ఉండవని పట్టణ ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెంజల్ : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాటాపూర్ చెరువు నిండి అడుగు ద్వారా పంట పొలాల వైపు నీరు ప్రవహిస్తూ ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పంట పొలాలు నీట మునిగాయని వాటిని తొలగించాలన్నా.. పైనుంచి మొండి వాగు ద్వారా విపరీతంగా నీరు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టిన పంట చేతికి వస్తుందో లేదోనన్న ఆందోళనలో రైతులు ఉన్నారు.



అలుగు పారుతున్న బెల్లాల్ చెరువు

సదాశివనగర్ : మండలంలోని చెరువులు కుంటలు రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో పంటలకు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎడపల్లిలో 19.5.మిల్లీమీటర్ల వర్షపాతం

ఎడపల్లి : మండలంలో 19.5. వర్షపాతం నమోదైనట్లు ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయ ఎఎస్ఓ సతీష్ తెలిపారు. వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

కూలిన రెండు నివాసపు ఇండ్లు



నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం రెండు నివాసపు ఇండ్లు భారీ వర్షానికి కూలిపోయాయి. మండల కేంద్రానికి చెందిన జోగు పెంటయ్య ఎరవాటి కిష్టయ్య నివాసపు ఇండ్లు వర్షానికి కూలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. దీంతో అధికారులు స్పందించి వెంటనే తమకు ఉండడానికి ఇల్లు సమకూర్చాలని కోరుతున్నారు. సుమారు ఆస్తినష్టం రూ.రెండు లక్షల ఉంటుందని తెలిపారు.

సెల్‌ఫోన్‌లకు అంకితం కావొద్దు

- పుస్తకాలను చదవాలి
- ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేటితరం యువతీయువకులు సెల్‌ఫోన్‌లకే అంకితం అవుతున్నారని.. అలా కాకుండా పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని, అప్పుడే నిర్దిష్టమైన అంశాలు తెలుస్తాయని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అన్నారు. నవతెలంగాణ బుక్‌హౌస్‌లో అందుబాటులో ఉన్న 'రాజ్యాంగం మనకేమిచ్చింది' అనే పుస్తకాన్ని ఆయన కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. దేశంలో ఉన్నటువంటి ప్రజలకు రాజ్యాంగం ఏ విధంగా ఉపయోగపడుతుందనే అంశాలను ఈ పుస్తకంలో రచించారని, అటువంటి పుస్తకాలను ప్రస్తుత కాలంలో చదవాల్సిన అవసరముందని ఆయన చెప్పారు. నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్‌లో అన్నీ రకాల పుస్తకాలు తక్కువ ధరలకే విక్రయించడం ప్రశంసించాల్సిన విషయమని కొనియాడారు. జెడ్పీటీసీ కొనుగోలు చేసిన పుస్తకాన్ని బుక్‌హౌస్ ఇంచార్జ్ నితీన్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, బీఆర్ఎస్ నాయకులున్నారు.



జెడ్పీటీసీకి పుస్తకాన్ని అందజేస్తున్న బుక్‌హౌస్ ఇంచార్జి

తక్షణ సహాయక చర్యలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారిపై నేలకొరిగిన మర్రి వృక్షాన్ని తొలగించే సహాయక చర్యల్లో ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లింగంపేట్ మండలం మెంగారం గ్రామ శివారులో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారికి అడ్డంకిగా మారి 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోవడంతో స్థానిక అధికారులు ఆ ప్రాంతానికి చేరుకొకముందే ఎల్లారెడ్డి శాసన సభ్యులు జాజాల సురేందర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి వెంటనే రెండు జేసీబీలను పిలిపించి భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రెండు గంటల పాటు తక్షణ సహాయ చర్యలు దగ్గరుండి పర్యవేక్షించారు. రవాణాకు అంతరాయం లేకుండా చేశారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రెండు గంటల పాటు దగ్గరుండి రోడ్డుపై పడ్డ మర్రిచెట్టును తొలగించడంలో ప్రధాన పాత్ర పోషించినందుకు పలువురు అభినందించారు.



జేసీబీలో చెట్టును తొలగిస్తున్న ఎమ్మెల్యే

నిధుల్లేవ్.. పనులు ఎలా చేయాలి?

- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

'పంచాయతీలకు నిధులు లేవు.. అప్పులు చేసి పనులు చేస్తున్నాం. అవి కూడా నిధులు మంజూరు కావటం లేదు. మిగతా పనులు ఎలా చేయాలి.' మండలంలోని మోస్రా, చింతకుంట, గోవూర్, తిమ్మాపూర్ గ్రామాల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మోస్రా మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పిట్ల ఉమా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. తమకు నిధులు రావటం లేదని ఇంకా అభివృద్ధి పనులు ఎలా చేయాలని ఎంపీపీని ప్రశ్నించారు. అంగన్వాడీ సెంటర్‌లు నిర్మాణం చేయలేకపోతున్నామంటే అందుకు కారణం జీపీకి నిధులు లేవని, ఇప్పటికే అప్పులు చేసినవి కట్టలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమ సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. గ్రామాలలో ఇంకా పనులు చేయబోమని తెలిపారు. మిషన్ భగీరథ నీటిపైపు లైన్‌లు లీకేజీ అవుతున్నా వాటిని పూర్తి చేయడానికి అధికారులు సహకరిస్తలేరని అన్నారు. తమకు నిధులు వస్తే గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్‌లు స్పష్టం చేశారు.

గోవూర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నీటి కొరత..

గ్రామంలో డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మాణం పూర్తి అయినా గృహ ప్రవేశాలు చేసినా ఇప్పటి ఆ కాలనీకి మిషన్ భగీరథ నీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదని, భగీరథ పీడీకి తెలిపినా పట్టించుకోవటం లేదని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామాలలో జరిగే పనుల వివరాలు పలు శాఖల అధికారులు చదివి వివరించారు. ఉపాధిహామీలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయాలని ఏపీవో తెలపగా కూలీలకు డబ్బులు రావటం లేదని ఫిర్యాదు చేస్తున్నారని సర్పంచ్‌లు చెప్పారు. ఉపాధి హామీలో హరితహారం మొక్కల పెంపకం కార్యక్రమం చేపట్టాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కత్తి శంకర్, తహసీల్దార్ సాయిలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సుమలత రాంరెడ్డి, విమల లింగయ్య, సున్నం భూమయ్య, నరేందర్‌రెడ్డి, ఎంపీవో షాపి తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం లో ఏకగ్రీవ తీర్మానం చేయాలి : సీఐటీయూ

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని మోస్రా మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పిట్ల ఉమాకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. 15 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. సర్వసభ్య సమావేశంలో తమ సమస్యలపై ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి తమ ఆవేదనను తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకుడు శోభన్, కారోబార్లు శ్రావణ్ కుమార్, రాము, జగదీష్, కార్మికులు సురేష్, అబ్బయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమంపై దృష్టి సారించాలి

- జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షాహేజాది

నవతెలంగాణ-తాడ్వాయి

మైనారిటీల సంక్షేమంపై దృష్టి సారించాలని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షాహేజాది అన్నారు. గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుతీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని మైనారిటీల స్థితిగతులు, వారి జనాభా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు ద్వారా చేకూర్చుతున్న లబ్ది గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం, మైనారిటీ గురుకులాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య మదర్సాల్లో అందుతున్న సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీలు, పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారం, మైనారిటీలకు ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాలు, షాదీముబారక్‌లో మైనారిటీలకు చేకూరిన లబ్ది, బ్యాంకుల ద్వారా మైనారిటీలకు అందించిన వివిధ రుణాలు, రెండు పడకల గదుల ఇండ్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించారు. మహిళా శిశు సంక్షేమం, మైనారిటీ గురుకుల పాఠశాలలు, బ్యాంకింగ్, విద్య రెవిన్యూ, పోలీస్ తదితర శాఖల పనితీరును సమీక్షిస్తూ మైనారిటీల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. మైనారిటీల అభ్యున్నతికోసం కృషి చేయవలసిన భాద్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేసి పేదల జీవితాలలో మార్పు తీసుకురావాలని, అప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయని అన్నారు. సమాజానికి మేలు చేకూర్చే పదవుల్లో ఉన్న ఉద్యోగులు సేవాభావంతో విధులు నిర్వర్తిస్తే ఎంతో సంతృప్తి కలుగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి 15 అంశాల కార్యకమంపై ప్రతి మూడు మాసాలకొకసారి కమిటీ సమావేశాలు నిర్వహించాలని, తద్వారా అవగాహన పెరుగుతుందని అన్నారు. జిల్లాలోని వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మైనారిటీ సభ్యులు మాట్లాడుతూ వక్ఫ్ భూములను కాపాడడంతో పాటు శ్మశానవాటికలకు స్థలాలను కేటాయించాలని, నిబంధనల మేరకు చర్చిల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరగా తగు చర్యలు తీసుకోవలసిందిగా సభ్యురాలు షాహేజాది అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి దయానంద్, ఆర్.డి.ఓ.లు శ్రీనివాస్‌రెడ్డి, రాజాగౌడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు

తెలంగాణలో రైతే రాజు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-రామారెడ్డి

దేశంలో రైతును రాజు చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం మండలంలోని కన్నాపూర్ రైతు వేదికలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి విద్యుత్ సరఫరాపై మాట్లాడిన విధానాన్ని ఖండిస్తూ రైతులతో, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. 65సంవత్సరాలు కాంగ్రెస్, బీజేపీకి పరిపాలించి రైతులకు చేసింది ఏమీలేదని అన్నారు. తెలంగాణ రాకముందు కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తప్ప రైతుకు మిగిలింది ఏమీ లేదని, తెలంగాణ ఏర్పాటు కోసం, అనేక ఉద్యమాలు చేసి, తెలంగాణ సాధించే వరకు వెనుకడుగు వేయలేదని, ఇక్కడ పాల్గొన్నవారు ప్రతి ఒక్కరూ తెలంగాణ కోసం కొట్లాడిన వారేనని అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత, కేసీఆర్ ఆధ్వర్యంలో రైతుబంధు, రైతుబీమా పథకాలు తెచ్చారని, మిషన్ కాకతీయతో భూగర్భ జలాలు పెరిగాయని అన్నారు. తెలంగాణ రాకముందు మాచారెడ్డి మండలంలో వందల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్రావు, సర్పంచ్ రాజనర్, రైతుబంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, గిద్ద ఎంపీటీసీ ప్రవీణ్‌గౌడ్, సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, ఉప సర్పంచ్ అంజలి రెడ్డి, సర్పంచులు సంజీవ్, చందర్ నాయక్, గంగారం, నాయకులు రాజేందర్ గౌడ్, జంగం లింగం, పడిగల శ్రీనివాస్, పోతునూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సురేందర్‌కు నిరసన సెగ..



టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యాలను నిరసిస్తూ మండలంలోని కన్నాపూర్‌లో చేపట్టిన సమావేశానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ వెళుండగా.. మండలంలోని కన్నాపూర్ శివారులో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కాన్వాయ్‌ను అడ్డుకొని నిరసన తెలిపారు. అంతకుముందు జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్, స్థానిక జెడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డిని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పోసానిపేట సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రామారెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు తాడ్వాయి, సదాశివనగర్ మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు రామారెడ్డిలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని, తమ నాయకులను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు విడుదల చేయడంతో, కాంగ్రెస్ నాయకులు శాంతించారు.

మా గోస పట్టదా..?

- రాచూర్ గ్రామస్తుల ఆవేదన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని రాచూర్ గ్రామప్రజల గోస ఎవరికి పట్టింపు లేకుండా పోయింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా.. గ్రామానికి వెళ్లే రోడ్డు మాత్రం అభివృద్ధి చేయడం లేదని గ్రామస్తులు అంటున్నారు.



రోడ్డు బాగలేక ట్రాక్టర్‌పై వెళ్తున్న గ్రామస్తులు

రహదారికి మూడు కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేయడంలో అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడం ఏదు. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాచూరు గ్రామ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రోడ్డే ప్రధానం. అయితే బురదమయమైన ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే నడవలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పనిలో భాగంగా ట్రాక్టర్‌పై వెళ్లవలసి వస్తుంది. ట్రాక్టర్ తప్ప ఇతర ఎలాంటి వాహనాలు ఈ రోడ్డు గుండా నడవలేని పరిస్థితి నెలకొంది. బురదమయంగా మారిన ఈ రోడ్డు గుండా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామానికి వస్తే మా గోస ఎలాంటిదో అర్థమవుతుందని గ్రామస్తులు అంటున్నారు. మూడు కిలోమీటర్ల మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చడానికి ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పపత్రిలో కూలిన పీఓపీ

- తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం పీఓపీ కూలిపోయింది. ఆసుపత్రిలోని పోస్ట్ ఆపరేటివ్ వార్డ్‌లో పీఓపీ ఒక్కసారిగా కింద పడిపోయింది. ఆ సమయంలో వార్డులో రోగులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆసుపత్రి భవనంపై సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది. సిబ్బంది ఎప్పటికప్పుడు ఆసుపత్రి భవనంపై పర్యవేక్షించాలని రోగులు కోరుతున్నారు.



కూలిన పీఓపీ

ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని వెల్లుట్ల, వెల్లుట్ల పేట, వెంకటాపూర్ గ్రామాల్లో ఈవీఎం, వీవీప్యాట్‌లపై గురువారం ప్రజలకు అవగాహన కల్పించినట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్.ఐ శ్రీనివాస్, ఎంపీవో ప్రకాష్, జూనియస్ అసిస్టెంట్ శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

లక్కీడ్రా ద్వారా బీఏఎస్ ప్రవేశాలు పూర్తి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్(బీఏఎస్) స్కీం కింద ఆయా పాఠశాలల్లో ప్రవేశాల కోసం గురువారం లక్కీ డ్రా ప్రక్రియ నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ పీ.యాదిరెడ్డి పర్యవేక్షణలో, విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా కొనసాగింది. ఒకటో తరగతిలో ప్రవేశాలు కోరుతూ 433 మంది దరఖాస్తు చేసుకోగా, డ్రా పద్ధతి ద్వారా 102 మందికి ప్రవేశాలు కల్పించారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి మొత్తం 511 మంది దరఖాస్తులు చేసుకోగా డ్రా ద్వారా 101 మందికి ప్రవేశాలు కల్పించడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి శశికళ తెలిపారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉంచాలి

జాయింట్ కలెక్టర్ చిత్రామిశ్రా

నవతెలంగాణ-ఆర్మూర్



గ్రామాల యందు పారిశుద్ధ నిర్వహణ సక్రమంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. మండలంలోని మిర్దాపల్లి గ్రామాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషిస్తున్నా రని, పల్లె ప్రకృతి వనాలు, తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో డిఎల్పిఓ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, ఉప సర్పంచ్ మధువర్మ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేరేవరకూ సమ్మె చేయండి

- మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు
- మోకాళ్లపై, ఒంటికాలిపై నిలబడి జీపీ కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఎంపీడీవో ఆఫీస్ ప్రాంగణంలో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతి కార్మికులకు పిసిసి ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్ మద్దతు తెలిపి మాట్లాడుతూ... తమ డిమాండ్ల నెరవేరాలని సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న ఈ సమ్మెకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దత్తు తెలువుతుందని అన్నారు. 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వారితో చర్చలు జరిపి వారి డిమాండ్లు నెరవేర్చకపోవటం వారిపై చూపుతున్న వివక్షకు నిదర్శనం అని అన్నారు. అవసరం వచ్చినప్పుడు వీరికి షాలువతో సన్మానం చేసిన, పొగడ్తలతో కీర్తించిన ఎమ్మెల్యే ఇప్పుడు ఎక్కడ పోయాడని, వారి సమస్యలు కనిపించడం లేదా.. అని అన్నారు. 11వ పీఆర్సి ప్రకారం 19వేలు కనీస వేతనం, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబనికి 10 లక్షల సాయం, ఈఎస్ఐ ప్రమాద భీమా, పిఎఫ్ కల్పించటం, ఆదివారం వండుగలపూట సెలవులు ప్రకటించడం, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ లను వెనక్కి తీసుకోవటం ఈ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని అన్నారు. డిమాండ్లు నేరవేరే వరకు సమ్మె కొనసాగించాలన్నారు. రానున్న ఎన్నికల్లో సమస్యల పరిష్కారానికి పార్టీ మానిఫెస్టోలో పెడుదామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మీర్ మాజీద్, అజ్జు, జిమ్మి రవి, అబ్దుల్ ఫాయిమ్, మందుల పోశెట్టి, బట్టు శంకర్, బాల కిషన్,పెద్ద పోశెట్టి, పాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు, సిబ్బంది చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం 15వ రోజు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఎంపీడీవో ఆఫీస్ నుండి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపి. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, సిఐటియు మండల కన్వీనర్ కుతాడీ ఎల్లయ్య మాట్లాడారు. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్, జెమిని రవి అన్న మద్దతు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజు, అధ్యక్షుడు జవహర్ సింగ్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకులు అంకాపూర్ ఈదుల గంగామణి, అశోక్, ఇస్సపల్లి గంగామణి, ఆలూరు చెంచు గంగు, మచ్చర్ల గంగాధర్, సాయన్న, గంగారం, ఐనార్ల పుష్ప, ఇస్సపల్లి గంగమణి, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఆర్మూర్: మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

నవీపేట్:పంచాయతీ కార్మికులు వర్షంలో సైతం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తుందని ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని వెంటనే సమ్మె డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో మేకల ఆంజనేయులు, మీన్ కుమార్, తులసీ రామ్, లలితా తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి క్రమబద్ధీకరించాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహసిల్దార్ సురేష్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సారా సురేష్, వేముల సత్యక్క మాట్లాడుతూ.... జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలి అన్నారు. మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను కార్యదర్శులుగా నియమించాలని కోరారు. ప్రభుత్వం చెప్పినట్లుగా పంచాయతీ కార్మికులకు ఏ ఒక్క హామీ కూడా అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తలారి రాజేశ్వర్, ఎండి బాజే సాహెబ్, గౌడ పోచయ్య వెంకటరమణ, అజారుద్దీన్, రాజేందర్, భరత్ కుమార్, గంగా సాయిలు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, దానికోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఇందల్ వాయి ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, ఎంపిఓ రాజ్ కాంత్ రావు లకు సిఐటియు మండల అధ్యక్షులు మ్యాదరి గంగారాం అధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా మ్యాదరి గంగారాం,డిచ్ పల్లి ఐఎఫ్టియు జిల్లా నాయకులు మురళి, గంగాధర్ లు మాట్లాడుతూ.. కార్మికుడు మరణిస్తే మట్టి ఖర్చుల కింద కనీసం 30 వేల రూపాయలు అందించాలని అన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని అన్నారు ఇకనైనా కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు . లేనియెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, కార్మికులు ముత్తన్న, గంగాధర్, భూమయ్య, రవి, రాజేందర్, పోసాని, దుర్గా, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి :పంచాయతీ పారిశుధ్య కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి సబబు కాదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వారిని ఉద్యోగం పర్మినెంట్ చేస్తూ, వారి జీతాలను పెంచి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, సాయిరెడ్డి, మండల అధ్యక్షుడు ఆశన్న, కార్యదర్శి విలాస్, సంతోష్,నారాయణ, భోజన్న, రాములు పాల్గొన్నారు.

నేడు ఎక్సెన్స్ అవార్డుల ప్రదానోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎక్సెన్స్ అవార్డులు ప్రదానోత్సవం ఇంటర్ విద్యార్థులకు ఉంటుందని టివియువి నాయకులు రమావత్ లాల్ సింగ్ అన్నారు. గురువారం టివియువి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కో వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టివియువి) ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నేడు (శుక్రవారం) అవార్డులు ప్రదానం చేస్తామని సమావేశం లో తెలిపారు. ఇంటర్మిడియేట్ లో ఆయా కళాశాల్లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు 2022 -23 అకాడమీ ఎక్సెన్స్ అవార్డులను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్ లో అందజేస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, డి.ఐ.ఈ.ఓ. రఘురాజ్, రాంమోహన్ రెడ్డి, బిలోజి నాయక్ హాజరవుతారు అని అన్నారు. సమావేశంలో టివియువి జిల్లా అధ్యక్షులు అజయ్, టివియువి జిల్లా ఇంఛార్జి నవీన్, సుభాష్ పాల్గొన్నారు.

సర్వే నంబర్ల ప్రకారం పంటల వివరాలను నమోదు చేయాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సర్వే నంబర్ల ప్రకారం రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేసే విధంగా చూడాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. గురువారం ఇందల్ వాయి మండలంలోని వెంగల్ పడ్ (పాటితండా) గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసిన పంట వివరాలను రైతులతో క్షేత స్థాయి లో మాట్లాడి పంటలను పరిశీలించి తగు సస్య రక్షణ చర్యలను వివరించారు. వర్షాల వల్ల పంటలు దెబ్బ తినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆరుతడి పంటల్లో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సందేహాలు ఏమైనా ఉంటే దానిని నివృత్తి చేసుకోవడానికి మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలపాలని పేర్కొన్నారు కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సంగెం ప్రవీణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీహరి, సతీష్, ప్రకాశ్ గౌడ్ రైతులు పాల్గొన్నారు.

రోడ్డు, భవన శాఖ మంత్రి ఉన్నా.. జిల్లాకు చేసిందేమిటి?

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లాలో రోడ్డు భవన నిర్మాణ శాఖా మంత్రి ఉండి కూడా జిల్లాకు ఎలాంటి ఉపయోగం లేదని, నిజామాబాద్ జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించాడానికి ముఖ్యమైన మార్గం మాధవనగర్ అని త్వరగా రోడ్డు మార్గాన్ని నిర్మించే విధంగా చూడాలని, ఫ్లైఓవర్ పనులు నత్తనడకన పనులు కొనసాగుతున్నాయని వేంటనే తాత్కాలికంగా రోడ్డు నిర్మాణం చేసి పనులను పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జీ డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. గురువారం డిచ్ పల్లి మండలంలోని బర్దిపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మాధవనగర్ సాయిబాబా ఆలయం వద్ద వర్షానికి రహదారి కొట్టుకుపోయిన విషయాన్ని తెలుసుకొని పరిశీలించారు. అనంతరం అర్అండ్‌బి ఎస్‌సితో మాట్లాడి త్వరగా పనులు చేయాలని అనానరు. ఆయన వెంట జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, టిపిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, రూరల్ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, అనిల్ రెడ్డి, వినోద్, ఆనంద్, వెంకటేష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

- ప్రాజెక్టు లోకి చేరుతున్న 59,165 క్యూసెక్కుల నీరు

నవతెలంగాణ-మెండోర

ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో పాటు మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలు నమోదు కావడంతో ప్రాజెక్టులోకి వరద నీరు పోటెత్తుతుంది. ఎగువ ప్రాంతాల నుండి వరద ప్రవాహం పెరిగి ప్రాజెక్టులోకి ప్రస్తుతం 59165 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. ఈనెల ఒకటిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు పూర్తిగా ఎత్తివేయడంతోపాటు. మహారాష్ట్ర ఎగువ ప్రాంతాలలో అధిక వర్షాలు నమోదు కావడంతో ప్రాజెక్టు లోకి అధికంగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆర్థిక సంవత్సరంలో 17 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. గత సంవత్సరం ఈ రోజు నాటికి ప్రాజెక్టు లో 77.702 టీఎంసీల నీరు నిలకడగా ఉండగా గురువారం సాయంత్రానికి 37 టీఎంసీల నీరు నిలకడగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1090 అడుగులు 90.313 టీఎంసీలు కాగా ఎగువ ప్రాంతాల నుండి వరద ఉధృతి చేరుతుండటంతో ప్రస్తుతం ప్రాజెక్టు లో 1073.8 అడుగులు 37 టీఎంసీల నీరు నిలకడగా ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. 394 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతుండగా అలీసాగర్ ఎత్తిపోతలకు 180 , గుత్ప ఎత్తిపోతల కు 270 క్యూసెక్కుల నీటిని వదులుతూ మిషన్ భగీరథ పథకం ధ్వార 152 క్యూసెక్కుల తాగునీటి ని సరఫరా చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మాధవనగర్ వద్ద కల్వర్టు నిర్మాణం పూర్తి

- లారీలు, వ్యాన్లు వెళ్లవద్దని అధికారుల సూచన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండలం లోని బర్దిపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మాధవనగర్ రైల్వేగేటు వద్ద నిన్న భారీ వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు నిర్మాణ పనులు గురువారం పూర్తయ్యాయి. ప్రజలకు ఇబ్బందులు ఎదురుకావద్దనే ఉద్దేశ్యంతో ఆర్ అండ్ బీ ఎస్ఈ రాజేశ్వర్ రెడ్డి, ఈఈ సురేష్, డీఈ ప్రవీణ్ లు యుద్ధప్రాతిపదికన కల్వర్టు నిర్మాణ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నారు. కేవలం ద్విచక్ర వాహనదారులకు మాత్రమే రాకపోకలకు అనుమతి ఇచ్చారు. లారీలు, వ్యాన్లు ఈ రూట్లో నుండి వెళ్లవద్దని అధికారులు సూచించారు. భారీ వాహనాలు ా బైపాస్ రోడ్డు మార్గం ద్వార మాత్రమే వెళ్లాలని అర్‌బి శాఖ అధికారులు వాహనదారులను కోరారు.

కాంగ్రెస్‌ను నమ్మితే
మూడు గంటలే కరెంట్

- ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

కాంగ్రెస్ నమ్మి మోసపోవద్దని, గోస పడతామని, మూడు గంటల కరెంటే దిక్కవుతుందని ఆర్టీసీ చైర్మన్, రూరల్ బాజిరెడ్డి గోవర్ధన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలం గుండారం రైతువేదికలో జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం పుట్టిన పార్టీతోనే అభివృద్ధి... కేసీఆర్ మళ్లీ వస్తే ప్రపంచవ్యాప్తంగా మనం నెంబర్ వన్ అవుతాం. మతం పేరిట చిచ్చు కావాలా...? ఏది శ్రేయస్కరమో రైతన్నల్లారా మీరే తేల్చుకోండి అని తెలిపారు. రేవంత్‌రెడ్డి పీసీసీ పదవిని చంద్రబాబు నాయుడు పైసలతో కొనుక్కున్నాడని, రేవంత్ చంద్రబాబుకు ప్రియ శిష్యుడని అన్నారు. చంద్రబాబు ఆనాడు వ్యవసాయం దండుగ అన్నట్టుగానే ఇప్పుడు అతని ఆత్మ అయిన రేవంత్‌తో మూడు గంటల కరెంటు అని అనిపిస్తున్నదని అన్నారాయన. చంద్రబాబును ఆనాడు రైతులు ఇంటికి సాగనంపారని, ఇప్పుడు కాంగ్రెస్‌కు కూడా అదే గతి పడుతుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో రైతులు వ్యవసాయం చేస్తే అంతా నష్టపోయారని అన్నారు. ఈ దరిద్రాన్ని పారద్రోలి వ్యవసాయాన్ని పండుగ చేసింది కేసీఆరేనని తెలిపారు. అప్పుడు మొత్తం ఉన్న భూమిని కూడా సాగు చేసుకునే పరిస్థితి లేదని, ఇప్పుడు ఎకరం కూడా పడావు లేకుండా పంటలు సాగు చేసుకుంటున్నారని, కూలీల కొరత ఏర్పడటంతో బీహార్ నుంచి తెచ్చుకుంటున్నారని తెలిపారు. మూడు పంటలు కావాల్నా.. మూడు గంటలు కావాల్నా.. మత చిచ్చు పెట్టే మంటలు కావాలా..? ఇప్పుడు మనది ఇదే నినాదం. రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఎవరూ బీజేపీకి అవసరం లేదు. మోసకారులు వస్తరు తొందరలో. రెచ్చగొడతారు. ఎమ్మెల్యేల గల్లా పట్టాలంటున్నారు. ఎందుకు పట్టాలా..? నిజానికి పట్టాల్సింది కాంగ్రెస్ నాయకుల గల్లా. తప్పుడు నినాదాలిచ్చి , ప్రజలను మోసం చేసి ఇరవై అయిదు గంటల కరెంటు ఇస్తామని చెప్పే పిచ్చి మాటల ప్రతిపక్షానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అసవరం ఉంది' అని బాజిరెడ్డి అన్నారు. రేవంత్ ముక్కుపిండి రైతులకు క్షమాపణ చెప్పేదాక వదలొద్దు అని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువ నాయకులు జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మధుకర్ రావు బాగారెడ్డి, ముస్కే సంతోష్, దాసరి శ్రీధర్, బోర్గం సొసైటి చైర్మన్ పాల్ద జితేందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు గుండారంలో సొసైటీ గోదాం భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

మద్దుత్ తండాలో తీజ్ పండగ

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి



తీజ్ వేడుకల్లో భూపతిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని మద్దుల్ తండాలో గురువారము గిరిపుత్రులు తీజ్ పండగ నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్సీ, రూరల్ కాంగ్రేస్ పార్టీ రూరల్ ఇంచార్జి డాక్టర్ భూపతి రెడ్డి ప్రత్యేక అహువానీతులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కన్నెపిల్లలు భక్తి శ్రద్ధలతో పూజించే మొలకల బుట్టను ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. వారితో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బల్ రాజ్, సుభాష్ రెడ్డి, జాన్ రెడ్డి, రమణ, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోటార్ బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

నవతెలంగాణ -నవీపేట్

మండలంలోని కోస్లి గ్రామానికి చెందిన అడెల్లి సాయిలు (40) మోటార్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో మృతి చెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు నవీపేట్ నుండి ఇంటికి వెళ్తుండగా నాగేపూర్ వద్ద డివైడర్ ను ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

నవతెలంగాణ-ముప్కాల్

జీవితంపై విరక్తితో ఓవ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ భాస్కరా చారి వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన విశ్వనాత్ గంగాధర్ (55) 20 సంవత్సరాలుగా కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో దినసరి కూలీగా పనిచేసుకుంటూ బతుకుతున్నాడు. కొంతకాలంగా ఉపాధి దొరక్కపోవడంతో విరక్తి చెందిన గంగాధర్ కొత్తపల్లి గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న విశ్వనాత్ మోతిలాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రచారానికే పథకాలు ప్రారంభిస్తున్నరు..

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ
- కిషన్‌రెడ్డిని ఈడ్చుకెళ్లడం మూర్ఖత్వపు పాలనకు నిదర్శనం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎన్నికల సమయంలో పథకాలను తూతూ మంత్రంగా కొన్ని ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని ధర్నా చౌక్‌లో బిజెపి అర్బన్ నియోజకవర్గం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ పతనం మొదలైందని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యం మీద పోరాటం చేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ని అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. పేదలకు అంద చేయాల్సిన డబుల్ బెడ్ రూమ్‌ల పరిశీలనకు పోతే ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఎందుకు వణుకు పుడుతుందన్నారు. పరిపాలనను మరిచి ఫామ్ హౌస్‌కు పరిమితమైనందున బయటకు తెచ్చే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కబ్జాల పరిపాలన, నియంతృత్వంతో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రిని తరిమి కొడతారని హెచ్చరించారు. శాంతియుతంగా వెళ్లిన కిషన్‌రెడ్డిని ఈడ్చుకెళ్ళడం, మూర్ఖత్వపు పాలనకు నిదర్శనం అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్కర్ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు సుక్క మధు, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, వినోద్ రెడ్డి, పంచారెడ్డి శ్రీధర్, మీసేవ శ్రీనివాస్, రోషన్ లాల్ బోర, షీలా శ్రీనివాస్ భట్టికారి ఆనంద్, మట్టం పవన్, గంగాధర్, పల్నాటి కార్తీక్ సాయినాథ్ ,కిరణ్, ప్రిన్ సాయి ,బిజెపి నాయకులు పాల్గొన్నారు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

డిఎంహెచ్‌వోకు సన్మానం

నవతెలంగాణ- నవీపేట్



డిఎంహెచ్ఓను సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

నిజామాబాద్ జిల్లా డిఎంహెచ్ వోగా సుదర్శన్ గురువారం ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన సందర్భంగా ఆయన బాధ్యతలు స్వీకరించి ఐదు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నవీపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ల సంఖ్య మరింత పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి కావ్య, సూపర్వైజర్ లు వెంకన్న, దేవేందర్, కిషన్, లింక్ వర్కర్ వడ్డే రవి మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-వేల్పూర్

మండల కేంద్రంలో రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి చిత్ర పటాలకు గురువారం పాలాభిషేకం చేశారు. 21 ప్యాకేజీ ద్వారా పెద్ద వాగులో కాళేశ్వరం నీళ్ళు చెక్ డ్యామ్‌లు నిండు కుండ పరవళ్ళు తొక్కుతున్నాయని తెలిపారు. పెద్ద వాగుకు నీళ్ళు రావాలంటే రామడుగు ప్రాజెక్ట్ నిండితే వచ్చేవి కావని ఇప్పుడు రామడుగు ప్రాజెక్ట్ నిండకున్నా చింతలూరు వద్ద 21 ప్యాకేజీ ద్వారా పంపులతో రోజుకు అర టీఎంసి చొప్పున నీళ్ళు పైపుల ద్వారా పెద్ద వాగు లోకి నిపండం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అర్.టి. ఏ మెంబర్ రేగుల్ల రాములు, ఉప సర్పంచ్ పిట్ల సత్యం , యం.పి.టి.సి మొండి మహేష్ , గ్రామ అధ్యక్షుడు బబ్బురు ప్రతాప్ రెడ్డి, ఆత్మ చైర్మెన్ నోముల రవీందర్, రైతు సమితి అధ్యక్షుడు ఏలేటి మోహన్, మొండి అశోక్, యల్ల మహేందర్ పాల్గొన్నారు.

18 ఏళ్ళు దాటిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

18 ఏళ్ళు దాటిన వారు ఓటరు నమోదు చేసుకోవాలని, ఆగస్టు 21డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువడుతుందని నియోజక వర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్ రెడ్డి, ధర్పల్లి ఎంపిడిఓ లక్ష్మణ్ అన్నారు. స్పెషల్ సమ్మరి రివిజన్‌లో బాగంగా మండల కేంద్రంలోని మానవత సదన్‌లో, ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామ పంచాయతీలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బుత్ లెవెల్ అధికారులకు గురువారం ఒక్కరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18ఏళ్ళు నిండిన వారికి ఓటర్ గా నమోదు చేసే విధంగా చూడాలని, ఓటర్ లిస్టులో ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తులు నింపేటప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్ రావు, టివి రోజా, మండల రెవెన్యూ అధికారి మోహమ్మద్ వాహిద్, శ్రీకాంత్, ఎఎస్ఓ రాజీవ్, కార్యదర్శి తిరునగరి శ్రీధర్‌తోపాటు బీఎల్ఓలు, సూపర్వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ సత్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గత మూడు రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కరెంటు తీగలు తెగిపడే ప్రమాదం ఉందని అలాగే పట్టణంలో ఎక్కువ శాతం ఇనుప కరెంటు స్తంభాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి గృహాలు కూలిపోయే ప్రమాదంలో ఉంటే స్థానిక కౌన్సిలర్‌కు లేదా మున్సిపాలిటీ సిబ్బందికి. రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించాలని అన్నారు.

23వ రోజుకు రిలే దీక్ష

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో రైతుల దీక్ష గురువారం 23వ రోజుకు చేరుకుంది. 80 శాతం రైతుల పంట పొలాలు ఈ రోడ్లపై నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, రోడ్లు గుంతల మయం కావడంతో ఇప్పటికీ నాటు వేసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలినడకన రావాలంటే కూలీలు భయపడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో తమ పంట పొలాలు బీడుగా మారే అవకాశం ఉందని వారు వాపోయారు. అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తమ పంట పొలాలకు వెళ్లే రోడ్ల మరమ్మతును యుద్ధ ప్రాతిపదికపైన పూర్తి చేయాలని లేనట్లయితే దీక్షను ఇలాగే కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

వర్షాన్ని సైతం లెక్కచేయక..

- 15వ రోజుకు జీపీ కార్మికుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-విలేకరుల బృందం

తమ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె గురువారం 15వ రోజుకు చేరింది. వర్షం పడుతున్నప్పటికీ జీపీ కార్మికులు వర్షంలోనే సమ్మెను కొనసాగించారు.

పిట్లం : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరింది. మూడు నాలుగు రోజులుగా ఎడతెరిపి కురుస్తున్న వర్షం సైతం లెక్కచేయకుండా వర్షంలోనూ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తుందని మండిపడ్డారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఇదే ధోరణి అవలంబిస్తుంటే సమ్మెను మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కొండ సుభాష్, పత్తి బాలమని, నర్సమ్మ, పత్తి సుశీల, ఎన్.సాయిలు, ఆరేటి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



పిట్లంలో సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు



ఎడపల్లి దప్పులతో నిరసన జీపీ కార్మికులు

దప్పులు కొడుతూ సిబ్బంది నిరసన..

ఎడపల్లి : మండల కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన నిరవధిక సమ్మె 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జీపీ కార్మికులు దప్పులు కొడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నిరవధిక సమ్మె శిబిరానికి సీఐటీయూ డివిజన్ నాయకులతో పాటు అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు గుమ్ముల గంగాధర్ సందర్శించి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు సిబ్బందికి మద్దతు పలికారు. అనంతరం నిజామాబాద్ జిల్లా జేఏసీ కన్వీనర్ జంగం గంగాధర్ మాట్లాడారు. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాన్ని అందించాలని, గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల, బిల్ కలెక్టర్ల, జీపీలో పనిచేస్తున్న ఇతర సిబ్బందికి గౌరవ వేతనాన్ని పెంచాలని ఆయన ప్రభుత్వంపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. జీపీ పారిశుధ్య కార్మికులతో పాటు సిబ్బంది 15రోజుల నుంచి నిర్వాహక సమ్మెలో చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో మండల కోకన్వీనర్ గంగరాజు, పాండు, కుంట సంతోష్, బిల్ కలెక్టర్ల యూనియన్ ఎడపల్లి మండల అధ్యక్షులు రాజు, గరిగింట్ల శ్రీనివాస్, స్వామి, పద్మ సాయమ్మ, అబ్బవ్వ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : మండలంలో జీపీ కార్మికులు మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ జంగం గంగాధర్, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ ఎస్సైగా ఉదయ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ నూతన ఎస్సైగా ఉదయ్ కుమార్ గురువారం సాయంత్రం బాధ్యతలను చేపట్టారు. అదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. రెంజల్ ఎస్సైగా పనిచేసిన పండ్ల సాయన్న అదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు.



ఉదయ్ కుమార్ ఎస్సై

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నవతెలంగాణ-ఎడపల్లి

వర్షాకాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై ఆరోగ్య ఉప కేంద్రం ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశావర్కర్ల పనితీరు ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వర్షపు నీరు వాకిల్ల ముందర, ఇంటి చుట్టూ పరిసరాలు ప్రాంతంలో నిల్వ ఉండకుండా నేరుగా వెళ్లేందుకు ప్రజలు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.

మత్స్యశాఖ కమిటీని అభివృద్ధి కృషి చేస్తా

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పున్న లక్ష్మన్, ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మత్స్య శాఖ జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన మాలబోయిన రాజును గురువారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మత్స్య శాఖ కమిటీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పున్న రాములు, నాగరాపు ఎల్లయ్య, లింగం, రవి, సిద్ధరములు, రాములు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కారణంగా క్యాన్సర్ పరీక్షలు వాయిదా

నవతెలంగాణ-బిచ్కుంద

లయన్స్ క్లబ్ బిచ్కుంద ఆధ్వర్యంలో బిచ్కుంద మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న మెడికల్ క్యాంపులో క్యాన్సర్ పరీక్షలను వాయిదా వేసినట్లు అధ్యక్షులు రాజు డాక్టర్ తెలిపారు. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా వాయిదా వేసినట్టు తెలిపారు. క్యాన్సర్ పరీక్షలు నిర్వహించే తేదీ వర్షాలు తగ్గిన తర్వాత క్యాన్సర్ మెడికల్ క్యాంప్ తేదీ ప్రకటించి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని వడ్డెరకాలనీకి చెందిన పల్లపు రాములు (35) సంవత్సరాలు గత కొంతకాలంగా భార్య పిల్లలకు దూరంగా ఉంటూ తన చిన్నమ్మ కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 17వ తేదీన సోమవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వాకబు చేయగా గురువారం బిచ్కుంద గ్రామ సమీపాన గల చౌదరి చెరువులో శవమై తేలడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి ఎస్సై శ్రీధర్‌రెడ్డి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చెల్లెలు లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పల్లపు రాములు

కనీస వేతనాల అమలు కోసం కార్మిక గర్జన

- వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన ఐఎఫ్‌టీయూ నాయకులు

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక గర్జన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి బాలరాజు, సహాయ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్‌కు ఇప్పటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ లాంటి ఆరోగ్య, ఉద్యోగ భద్రత లేదన్నారు. కనీస వేతనాలు అమలు కాక, శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.60 కూడా వీరికి అమలు కావడం లేదన్నారు. పని భారం పెరిగినా ఖాళీలు భర్తీ చేయడం లేదన్నారు. ఇంటర్ కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన కేజీబీవీల్లో పనిభారం మరింత తీవ్రంగా ఉందన్నారు. కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేజీబీవీల్లో పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సర్వీస్ వెయిటేజీ ఇవ్వాలన్నారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన కేజీబీవీల్లో కుక్, స్వీపర్, అటెండర్, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కంప్యూటర్, ఒకేషనల్ ట్రైనర్లకు ఫుల్ టైం వేతనాలు ఇవ్వాలన్నారు. ఏ.ఎన్.ఎంల నైట్ డ్యూటీలను 3 రోజుల నుంచి ఒక రోజుకు తగ్గించాలన్నారు. అకౌంటెంట్లకు బదిలీలు చేపట్టాలన్నారు. పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. చనిపోయిన వారి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనలో భాగంగా ఆగస్టు 4న హైదరాబాద్‌లో కార్మిక గర్జన నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు శ్రీనివాస్, నారాయణ, సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సురేష్, కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ల ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కేజ్‌వీల్స్ రోడ్డుపై నడపొద్దు

- సూచించిన పోలీసులు

నవతెలంగాణ-గాంధారి/పెద్దకొడప్‌గల్

రోడ్లపై కేజ్‌వీల్స్‌ను నడపొద్దని ఎస్ఐ డి.సుధాకర్ తెలిపారు. మండలంలోని పోతంగల్ గ్రామ శివారులో గురువారం రోడ్డుపైన కేజీవీల్ ట్రాక్టర్‌ను నడిపిన రెండు ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు ఇద్దరు ట్రాక్టర్ యజమానులపై కేసునమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధారి మండలంలోని పోతంగాల్ గ్రామానికి చెందిన వెనువర్ధన్‌రెడ్డి, చాకలి సాయిలు తమ కేజీవీల్స్‌తో పోతాంగల్ గ్రామ శివారులో తారు రోడ్డుపై ట్రాక్టర్ నడుపుతుండగా పట్టుకొని సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. తారు రోడ్డుపై కేజ్‌వీల్‌తో ట్రాక్టర్ నడపడం కారణంగా రోడ్లు పాడవుతున్నాయని అందుకే కేసు నమోదు చేసినట్టు వివరించారు. ఆయన వెంట ఏఎస్సై గణేష్, కానిస్టేబుల్‌లు యాదగిరి, ప్రణీత్, భనుచందర్, దిలీప్ ఉన్నారు.



గాంధారిలో కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ని పట్టివేత

కేజ్‌వీల్స్ రోడ్లపై నడిపితే కఠిన చర్యలు..

పెద్దకొడప్‌గల్ : రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కోనారెడ్డి అన్నారు. రోడ్లను ధ్వంసం చేయవద్దని కలెక్టర్, ఎస్పీ ఆదేశాలనుసారం మండలంలో ఉన్న ట్రాక్టర్లకు కేజ్‌వీల్స్‌కు పట్టీలు బిగించి నడపాలన్నారు.

వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలుగా సుజాత సూర్యవంశీ



ఎన్నికైన సుజాతను సన్మానిస్తున్న మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-బోధన్

వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులుగా బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన సుజాత సూర్యవంశీ ఎన్నికయ్యారు. బుధవారం నల్గొండ జిల్లాలో జరిగిన వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశాలలో నూతన కమిటీల ఎన్నిక జరిగిందని సుజాత సూర్యవంశీ తెలిపారు. అందులో భాగంగా నూతనంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులుగా సుజాత సూర్య వంశీని, మహిళా జాతీయ అధ్యక్షురాలుగా భవాని చౌదరిని, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా మంగమ్మను, అలాగే జాతీయ ప్రధాన కార్యదర్శిగా గడ్డం కాశీంను ఎన్నుకున్నట్టు ఆమె తెలిపారు. తనపై నమ్మకంతో జాతీయ అధ్యక్షులుగా నియమించిన మందకృష్ణ మాదిగకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 7వ తేదీన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వికలాంగుల సమస్యల సాధనకై తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు.

కార్మిక గర్జనను జయప్రదం చేయండి

- ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్

నవతెలంగాణ-బోధన్

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆగస్టు 4న చేపట్టే కార్మిక గర్జనను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ అన్నారు. గురువారం బోధన్ మండలంలోని అమ్దాపూర్‌లో నిర్వహించిన బీడీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 4వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే కార్మిక గర్జనను కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈపీఎఫ్ కార్మికులు రాజీనామాలు చేసిన తర్వాత ఇచ్చే పెన్షన్ నెలకు పదివేలు ఇవ్వాలని, కార్మికుల వేతన జీవోలను ఐదు సంవత్సరాలకు ఒకసారి సవరించాలని, ఇల్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించి ఇవ్వాలని, సొంత స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10లక్షలు ఇవ్వాలని, ఇతర డిమాండ్ల సాధనకై ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆగస్టు 4న నిర్వహించే కార్మిక గర్జన కార్యక్రమానికి కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బి.మల్లేష్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వెంకటి, సాయిలు, భీమయ్య, గోదావరి, రుక్మాబాయి, కె.బుజ్జవ్వ, సువర్ణ, రుక్మ రేణుక కార్మికులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఎన్ఆర్ఐ బెహరాన్ ఉపాధ్యక్షులుగా రాములు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎన్నారై బెహరాన్ ఉపాధ్యక్షులుగా మీ రోల్ల రాములును నియమించినట్టు బిసి సంక్షేమ సంఘం నాయకులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. తనకు అవకాశం ఇచ్చిన రాష్ట్ర, జిల్లా అధ్యక్ష కార్యవర్గంకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని అన్నారు. బీసీ ఎన్ఆర్ఐలకు ఎటువంటి సమస్యలు వచ్చిన వారికి అండగా ఉంటానని, బిసి సంక్షేమ సంఘం కోసం పాటు పడతానని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్ర పరిసరాలలో మద్యం తాగి వాహనాన్ని నడిపిస్తున్న వ్యక్తిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అరెస్ట్ చేసినట్టు ఎస్సై రాజు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తిని డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా గురువారం కామారెడ్డి న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా అతనికి రూ.200 జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష వేస్తున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారని ఆయన తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ వాయిదా

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 20 నుంచి వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం దానిని వాయిదా వేసినట్లు ఆరోగ్య విస్తీర్ణ అధికారి రవీందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పేర్కొన్నారు. విపరీతంగా వర్షాలు పడడంతో ప్రభుత్వం రెండు రోజులు పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ఈ కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు వారు పేర్కొన్నారు. త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు.

దోమల లార్వా పెరగకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఏర్గట్ల

అధిక వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా గ్రామపంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులను చేయించాలని ఎంపీఓ శివ చరణ్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మురికి నీటిలో దోమల లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్ వేయించాలని, బ్లీచింగ్, సున్నం కలిపి చల్లాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టీఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు కారోబార్లు పాల్గొన్నారు.

విద్వేషాన్ని రెచ్చగొడుతున్న ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలి :పీడీఎస్‌యూ



మణిపూర్ ఘటన పై పిడిఎస్‌యూ నాయకులు ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతున్న మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని, మణిపూర్ మహిళలపై జరిగిన సంఘటన కారకులపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యూ నాయకులు గురువారం డిమాండ్ చేశారు. బిజెపి పాలిత ప్రాంతమైన మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన అమానుష సంఘటనకు వ్యతిరేకంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మణిపూర్ రాష్ట్రంలో ప్రజల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతూ, ఘర్షణలను ప్రేరేపిస్తున్నారని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తన పార్టీ అధికారంలో ఉన్న మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నడిరోడ్డుపై నగ్నంగా తీసుకెళ్లడాన్ని ఖండించారు. ప్రగతిశీల విద్యార్థులు మేధావులు, మహిళలు, భారతదేశ ప్రజలు దీన్ని ఖండించాల్సిందిగా కోరారు. రెండు నెలలుగా ప్రజల మధ్య విద్వేషాలు ఘర్షణలు జరుగుతున్నా అక్కడి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వీటిపై విచారణ చేపట్టకపోవడం స్పందించకపోవడం చూస్తుంటే మరోసారి బిజెపి రాజకీయ ఎత్తుగడలకు తెరలేపిందని అన్నారు. మహిళలపై అక్కడి ప్రజలపై జరుగుతున్న హింసాత్మక దాడులను ప్రేరేపించే వారిపై, రాష్ట్ర ప్రభుత్వంపైన సుప్రీంకోర్టు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ నగర అధ్యక్షులు ఎస్కే అశుర్, నాయకులు సలీం, సతీష్, శివ, ఉదయ్ లు పాల్గొన్నారు.

పురాతన మట్టి బురుజు తొలగించాలి

- కలెక్టర్‌కు విన్నవించిన ఎంపీపీ


నవతెలంగాణ-బోధన్

సాలూరా మండలంలోని హున్సా గ్రామంలో జనావాసాల మధ్య గల పురాతన మట్టి బుర్జును తొలగించాలని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫోన్ ద్వారా విన్నవించారు. పురాతన మట్టి బురుజు జనావాసాల మధ్య ఉండడంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దాని మట్టి తడిసిపోయి నివాసాలపై పడుతుందని ఎంపీపీ తెలిపారు. బురుజు చాలా ఎత్తుగా ఉండటం, వర్షపు నీటితో తడిసి ఉండటంతో అది ఎప్పుడు కూలుతుందోనని చుట్టుపక్కల వారు ఆందోళన చెందుతున్నారని గ్రామస్థులు తనకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ విషయం బోధన్ ఆర్డీఓ, సాలూరా మండల తహసీల్దార్‌లకు తెలిపినట్టు వివరించారు. ప్రాణ నష్టం జరగకుండా తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను కోరారు.

ఎడపల్లి ఎస్ఐగా విక్రమ్

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి నూతన ఎస్ఐగా భూపెల్లి విక్రమ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆదిలాబాద్ జిల్లాలో ఎస్ఐగా పనిచేసిన భూపెల్లి విక్రమ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీలో భాగంగా ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఎడపల్లిలో పనిచేసిన ఎస్ఐ పాండేరావు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రత పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



బాధ్యతలు తీసుకుంటున్న ఎస్ఐ

అదనపు కలెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లాకు నూతనంగా అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి గురువారం ఇందల్వాయి మండల ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రఘునాథన్ రాము, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాటిపాముల శ్రీనివాస్ గుప్త మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే శాలువాతో ఘనంగా సన్మానించారు. గతంలో నిజామాబాద్ డివిజన్ ఆర్డీవోగా విధులు నిర్వహించిన యాదిరెడ్డి నిజామాబాద్ జిల్లాకు అదనపు కలెక్టర్ హోదాలో రావడంతో సన్మానించినట్లు వారు తెలిపారు.



యాదిరెడ్డికి బొకేను అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రేషన్ బియ్యం పంపిణీ చేయాలి

నవతెలంగాణ-రెంజల్

మండలంలో రేషన్ బియ్యం ఇంతవరకు పంపిణీ చేయకపోవడంతో నిరుపేదలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే నశీర్ స్పష్టం చేశారు. ప్రతినెలా ఏడో తారీఖు లోపు బియ్యం సరఫరా ఇవ్వాలని, కానీ ఈనెల 20వ తేదీ దాటినా ఇంతవరకు బియ్యం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. రేషన్ బియ్యం లేక నిరుపేద కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిరుపేదలకు రేషన్ పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వెంట స్థానిక నాయకులు ఎల్. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నశీర్

జుక్కల్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-జుక్కల్

లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో జుక్కల్ మండల కేంద్రంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించినట్టు మండల నిర్వహకులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాన్ని ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320-డి గవర్నర్ లక్ష్మీ పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. వచ్చిన వృద్ధులకు, పేషెంట్‌లకు బిస్కట్‌లు, అల్పాహారం అందజేశారు. షుగర్, బీపీ, క్యాన్సర్, పరీక్షలను పరిశీలించారు. గవర్నర్ లక్ష్మీ మాట్లాడుతూ.. మానవసేవయే మాదవ సేవా అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు, సాయగౌడ్, నీలుపటేల్, రాజుపటేల్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ వారి ఉచిత వైద్యశిబిర్యం

పాఠశాలల గ్రాంట్స్‌పై అడిట్

నవతెలంగాణ-మాక్లూర్

మండలకేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో 2022-2023 ఆర్థిక సంవత్సరం పాఠశాలలకు మంజూరైన గ్రాంట్స్ వాటి వినియోగంపై విద్యాశాఖ ఆడిటర్లు శ్రీనివాస్, భాస్కర్‌తో గురువారం ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో 56 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఇఓ రాజ్ గాంగరెడ్డి పాల్గొన్నారు.



ఆడిటింగ్ చేస్తున్న ఆడిటర్లు

కారు బోల్తా

• తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన మగ్గిడి సదానంద్ కారు సిరికొండ నుండి కొండూరు వైపు వెళుస్తుండగా బుధవారం రాత్రి సమయంలో రోడ్డుపైన నీళ్లు నిలిచి ఉండడంతో రోడ్డు కానరాక కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని ఎస్సై జి రమేష్ తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకి రోడ్లన్నీ జలమయం అవ్వడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితుల్లో అయోమయంలో ప్రయాణికులు ఉన్నారని, వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రయాణాలు పెట్టుకోవద్దని, ప్రయాణికులకు పలు సూచనలు చేశారు.

రెండు రోజులు జరిగే పరీక్షలు రద్దు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విస్తృత వర్షాల కారణంగా తెలంగాణ ప్రభుత్వం రెండు రోజులు (20,21)న సెలవులు ప్రకటించినందున తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళ్లాలల్లో జరుగుచున్న యూజి (ప్రాక్టికల్స్, ప్రాజెక్ట్ వర్క్),పిజీ పరీక్ష ల ను వాయిదా వేయడం జరిగిందని ,22 న జరిగే పరీక్ష యధావిధి గా జరుగుతయని, వాయిదా వేయబడిన పరీక్షల తేదీలు త్వరలోనే ప్రకటిస్తామని తెలంగాణ యూనివర్సిటీ పరీక్ష నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

సేవా పతకం కోసం పాకులాట

• గుర్తింపుతో పొందాలి.. గుర్తింపు కోసం కాదు..

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉద్యోగుల సర్వీస్‌ని బట్టి, వారు చేసే పనులను బట్టి, ప్రజలకు చేసే సేవలను బట్టి మంచి సేవా కార్యక్రమాలు చేశారని అటువంటి అధికారులను, ఉద్యోగులను గుర్తించి ఉత్తమ సేవ పతకాలను అందిస్తుంటారు. అటువంటిది (రక్షణ శాఖలో) పోలీస్ శాఖలో అధికారులు ఉద్యోగులు చేసిన సేవలను గుర్తించుటకు శాఖ అధికారులు ఉన్నప్పటికీ కొందరు అత్యుత్సాహంతో సేవా పతకం పొందటానికి తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. కొందరు అధికారుల చేతులు తడపడంతో ఆ అధికారులు ఉద్యోగులకు ఉత్తమ సేవ పురస్కారం అందుకుంటున్నారు. ఆ ఉత్తమ సేవకులను ప్రతి ఆరు నెలలకు ఒకసారి గుర్తించి జిల్లా స్థాయి అధికారుల చేతుల మీదుగా పతకాలు అందిస్తారు. ఒక ఉద్యోగికి ఒకసారి ఒక సేవా పతకం అందించిన తర్వాత మళ్లీ అదే సేవ పతకానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ విషయం కొందరి దరఖాస్తు చేసుకునే వారికి తెలియడంతో దరఖాస్తు దారుడు మళ్లీ విరమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ అధికారికి గత 2021 సంవత్సరం జనవరిలో ఉత్తమ సేవాపథకం అందుకున్నారు. ఈ సేవ పతకంతో ప్రభుత్వం 20వేల(రెమ్యూనరేషన్) ప్రోత్సాహకం తో పాటు ఒక ప్రశంస పత్రాన్ని అందజేశారు. అదే ఉద్యోగస్తుడు మళ్లీ 2023లో ఉత్తమ సేవ పతకం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నా విషయం బయటకు తెలియడంతో ఆ ఉద్యోగస్తుడు దరఖాస్తును వెనక్కి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇచ్చిన దరఖాస్తును రద్దు చేసుకునే ప్రయత్నం ముమ్మరం చేశారు. అధికారులే ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడితే, సమాజానికి వారు న్యాయం ఎలా చేస్తారని పలువురు అంటున్నారు.

కొండం చెరువులో నీళ్లు ఖాళీ

• తూము షెటర్ సరిగా క్లోజ్ చేయకపోవడమే కారణం

నవతెలంగాణ-మోపాల్

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంచిప్ప కొండం చెరువులోకొ వస్తున్న నీళ్లు బయటకు వెళ్లిపోటతంది. ెరువుకు ఒక తూములో షట్టర్ సరిగా క్లోజ్ చేయలేని కారణంగా వచ్చిన నీరు వచ్చినట్టుగా బయటకు వెళ్తోంది. ఇది గమనించిన గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎంపీడీవో లింగం సర్పంచ్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు ఇందూరి సిద్ధార్థ, ఉపసర్పంచ్ జగదీష్, కోఆప్షన్ మెంబర్ అజీమ్, గ్రామ సెక్రెటరీ శ్యామ్ బాడ్సి , మంచిప్ప కాందార్లతో వెళ్లి మొరం సంచులతో తాత్కాలికంగా నీటి ప్రవాహాన్ని ఆపారు. ఇరిగేషన్ ఆఫీసర్లకు తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు మరమ్మత్తులు చేపట్టాలని సర్పంచ్ సిద్ధార్థ కోరారు

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల



ఎస్సైని సన్మనిస్తున్న ప్రజాప్రతినిధులు, విలేకరులు

మండలకేంద్రంలో విధులు నిర్వర్తించి బదిలీపై నిర్మల్ జిల్లా మామడ పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న ఎస్సై రాజును మండల ప్రజాప్రతినిధులు, విలేకరులు, పోలీసులు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్ర మంలో సిఐ వెంకటేశ్వర్లు, సీసీఎస్ సిఐ గోపీనాథ్, ఏఎస్సై లక్కోర గంగాధర్, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, చిల్క కిషన్, కానిస్టేబుళ్లు, విలేకరులు పాల్గొన్నారు

జల సవ్వడికి వేలాయే

• సంస్థాన్ సిర్నాపల్లిలో వాటర్ ఫాల్స్ కనువిందు



అలుగుపారుతున్న చెరువు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత నెలన్నర రోజుల నుండి ఆశించిన మేరకు వర్షాలు లేక దిగులు చెందిన రైతులు, యువకులు, ప్రజలు గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆహ్లాదాన్ని ఇచ్చే జల సవ్వడి వేళ రానే వచ్చేసింది. ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లిలో ఉన్న శీలం జానకి బాయి పెద్ద చెరువు (సిర్నాపల్లి వాటర్ ఫాల్స్, జలపాతం గురువారం నుండి వర్షపు నీరు అలుగు పైనుండి పారడం మొదలైందని సర్పంచ్ తేలు విజయ్ కుమార్, ఎంపిటిసి కచ్చకాయల అశ్విని శ్రీనివాస్ తెలిపారు. ఈ అద్భుతమైన సుందర దశ్యాన్ని తిలకించడానికి సమయం రానే వచ్చేసింది. వాటర్ ఫాల్స్ చూడడానికి రాష్ట్రంలోని లపు జిల్లాలు మండలాల నుండి ప్రజల రాకపోకలు ఇక మొదలైనట్లేనని గ్రామస్తులు తెలిపారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నవీపేట్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్ రావు అరెస్టులకు నిరసనగా బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు వంశీ మోహన్ మాట్లాడుతూ బాట సింగారంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలనకు వెళ్తున్న కిషన్ రెడ్డిని అరెస్టు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకపోవడమే కాక ప్రతిపక్షాల నోరు మూసేసే చర్యలకు పూనుకోవడం హేయమైన చర్య అని అన్నారు. వెంటనే విడుదల చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బందెల ఆనంద్, వంశీ మోహన్, రామకష్ణ, గణేష్, బాల గంగాధర్, బండారి శేఖర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలో కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ఒకపక్కన జోరున వర్షం కురుస్తుండగానే తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఇంటీరియర్ రిలీఫ్ 30శాతం ఇస్తూ పీఆర్సీ కమిటీని నియమించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేటు, ఆస్పత్రుల్లో అనుమతించాలని, ఆర్టీసీ ప్రయాణాల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీలను ఇవ్వాలని అన్నారు. మొదటి తేదీనే పెన్షన్లు చెల్లించాలని, మార్కెట్, గ్రంథాలయ శాఖలోని పెన్షనర్లకు హెల్త్ స్కీముని అమలు చేయాలని, తది తర డిమాండ్లతో ప్లకార్డ్స్‌తో రిటైర్డు ఉద్యోగులు ధర్నాను నిర్వహించారు. కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు ఈవీఎల్ నారాయణ ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్రావు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో అసోసియేట్ ప్రెసిడెంట్ సుదర్శన్ రాజ్, ప్రధాన కార్యదర్శి ఎస్. మదన్మోహన్, జిల్లా నాయకులు జార్జ్, భోజారావు, లావు వీరయ్య, ప్రసాద్ రావు, హనుమాన్లు, లక్ష్మీనారాయణ, రాధాకిషన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తదనంతరం ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి మెమోరాండం సమర్పించారు. పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను గురించి చర్చించారు.

ఐటీ హబ్‌లో ఉద్యోగాల కోసం నేడు జాబ్ మేళా

• భూమారెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో హాజరు కావాలి

నవతెలంగాణ-మోపాల్



తెలంగాణలో ఐటి రంగాన్ని విస్తరించి గ్రామీణ ప్రాంత యువతకు సైతం భాగస్వాములు చేయాలనే ఉద్దేశంలో ఐటీ మంత్రి కేసీఆర్ జిల్లా కేంద్రాల్లోగల ఐటీ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నారని, అందులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సార్థ్యంలో ఐటి హబ్ నిర్మాణం పూర్తయిందని ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ అన్నారు. భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జాబ్‌మేళా ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఐటి మంత్రి కేటీఆర్ వారంరోజుల్లో ఐటీ హబ్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. స్థానికంగా ఉన్న విద్యార్థులు, కొత్తగా పాస్ అయిన ఇంజనీర్ విద్యార్థులు, డిగ్రీలో డేటా సైన్స్ చదివిన విద్యార్థుల కోసం ఈ నెల 21న జాబ్ మేళాను తెలంగాణ అకాడమి స్కిల్ అండ్ నాలెడ్జ్ సీఈవో శ్రీకాంత్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని అన్నారు. దీనికి అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల నాయకత్వం నిర్వహిస్తున్నా రన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి ఐటీ కంపెనీలో పనిచేస్తున్న నిపుణులు ఇక్కడికి వచ్చి కంపనీల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే బిగాల సివిల్ ఇంజనీర్ కావున నిజామాబాద్‌ను ఆర్కిటెక్ విజన్‌తో అల్ట్రా మాడల్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే ఇంజనీరింగ్, సైన్స్ డేటాబేస్ ఉన్న నిరుద్యోగ యువత. భూంరెడ్డి కన్వర్షన్ సెంటర్‌లో హజరు కావాలని తెలిపారు.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిదులు, నాయకులు

బాల్కొండ మండలంలోని వన్నెల్ (బి) రైతు వేదిక భవనంలో గురువారం క్లస్టర్ పరిధిలోని చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ లావణ్య లింగాగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ నాగులపల్లి రాజేశ్వర్ మాట్లాడారు. ఉచిత విద్యుత్తుపై పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి 3 గంటలే సరిపోతుందని రైతు వ్యతిరేక వివాదాస్పద వ్యాఖ్యలపై రైతుల్లో చర్చ జరగాలనే ఉద్దేశంతో రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హయాంలోనే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందుతుందని వారు చెప్పారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆయన రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్, సర్పంచ్ లు చాట్లపల్లి వనజ గోవర్ధన్ గౌడ్, మంథని చిన్నయ్య, నాగులపల్లి భూదేవి కిషన్, ఎంపీటీసీ సభ్యులు సనుగుల కవిత శ్యామ్ సుందర్, రైతు బంధు గ్రామ కో ఆర్డినేటర్లు అలుక శ్రీనివాస్ గౌడ్, పన్నాల గంగారెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బక్కూరి భూమేశ్వర్, సొసైటీ డైరెక్టర్ చిన్నోళ్ల ధమ్మన్న, గ్రామ శాఖ అధ్యక్షులు న్యావానంది సాయన్న, పెద్ది గంగాధర్, కోటగిరి శ్రీకాంత్ చారి, ఉపసర్పంచి పెద్ది గంగాధర్, మాజీ సర్పంచి తలారి గంగాధర్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటులో నిబంధనలను పాటించాలి

• జాబితాలో వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో సర్ ప్లస్ ఉపాధ్యాయులను అవసరమున్న పాఠశాలకు నిబంధన మేరకు మండల పరిధిలో సర్దుబాటు చేయాలని, ఆ జాబితాలను ప్రకటించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేస్తూ జిల్లా అధ్యక్షులు బాలయ్య, ప్రధాన కార్యదర్శి రాజన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో అనేక అక్రమాలు జరిగాయని, అనేక మండలాలలో సర్ ప్లస్‌ను అవసరమున్న పాఠశాలలకు అడ్జస్ట్ చేయకుండా వదిలివేసిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా సుదూర మండలాలకు అక్రమంగా డిప్యూటేషన్ వేసిన సందర్భాలు కూడా ఉన్నాయని, కొందరు ఉపాధ్యాయులు ఎటువంటి డిప్యూటేషన్ ఉత్తర్వులు లేకపోయినా డివిజన్లు దాటి తమకు నచ్చిన పాఠశాలలో పనిచేస్తే ఆ ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులు వేతనాలను నిలిపివేయక బాధ్యత రాహిత్యంగా ప్రవర్తించి నెల నెల వేతనాలు చెల్లించి అక్రమాలకు పాల్పడ్డ సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఈ సంవత్సరం అక్రమాలు జరగకుండా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అయినప్పటికీ అక్రమాలు కొనసాగితే అందుకు జిల్లా విద్యాశాఖనే బాధ్యత వహించాలని పేర్కొన్నారు.


ఐటీ హబ్‌లో జాబ్ మేళాలు సరే ...

మరి ప్రభుత్వ ఉద్యోగాల మాటేమిటి

• ఎన్నికల విన్యాసంలో భాగంగానే జాబ్ మేళా

• కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు సొప్పరి వినోద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



సమావేశంలో మాట్లాడుతున్న సొప్పరి వినోద్

నిరుద్యోగులను మభ్య పెట్టడానికే ఐటి హబ్ పేరుతో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు సొప్పరి వినోద్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ యువత కోసం బీఆర్‌ఎస్ ప్రకటించిన ఇంటికో ఉద్యోగం నిరుద్యోగులకు 3016 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మోసం చేసిందని, వాటి నుండి యువత దృష్టి మరల్చడానికే ఐటిహబ్ పేరుతో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ పూర్తి చేయకుండా అసలు ప్రారంభమే కానీ ఐటి హబ్ లో ప్రైవేట్ కంపెనీల ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తామనడం హాస్యాస్పదమని తెలిపారు. జాబ్ మేళాలో ఏఏ కంపెనీలు పాల్గొంటున్నాయో

అసలు కంపెనీలు ఎన్ని సంవత్సరాల అగ్రిమెంట్ ప్రతిపాదికన ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నాయో ఏమి చెప్పకుండా కేవలం జాబ్ మేళా కోసం ప్రచారం చేస్తూ యువతను మోసం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మరోసారి యువతను మోసం చేసే ప్రక్రియలో భాగంగానే ఐటి హబ్‌లు ప్రైవేట్ జాబ్ మేళాల పేరుతో ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. ఈ జాబ్ మేళాలో ఉద్యోగం వచ్చినవారు ఎన్నికల అయిపోయే వరకే ఉద్యోగంలో ఉంటారని, తర్వాత ఆయా కంపెనీలు చేతులెత్తేస్తాయని, యువత భవిష్యత్ అయోమయంలో పడుతుందని అన్నారు. జాబ్ మేళాలో ఉద్యోగం పేరుతో వచ్చే యువత యొక్క డేటా సేకరించి ఎన్నికలవేళ వారిని ప్రలోభ పెట్టే ఆలోచనలో భాగంగానే ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. టాస్క్‌ద్వారా రూరల్‌లో ఎంతమంది యువతకు ఉద్యోగ నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి ఎక్కడెక్కడ ఉద్యోగాలు కల్పించారో తెలియజేయాలని ఆయన అన్నారు.

ఇప్పుడే ఎందుకు ఐటీ హబ్ ల పేరుతో హడావిడి చేస్తున్నారని ఇలాంటి జాబ్ మేళాలు 9 సంవత్సరాల కాలంలో ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో యువత నిరుద్యోగులే ఘోరి కడతారని ఆయన అన్నారు. సమావేశంలో రూరల్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సుధీర్ ప్రశాంత్ ప్రేమ్ కుమార్, యువజన నాయకులు పాల్గొన్నారు.

బీటీ రహదారి పునరుద్ధరణకు నిధులు మంజూరు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాంపూర్ నుండి మల్లాపూర్ వరకు బీటీ రహదారి పునరుద్ధరణ చేయడానికి రెండు కోట్ల నలభై లక్షల రూపాయలను ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మంజూరు చేయడం పట్ల ఇందల్‌వాయి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రఘునథన్ రాము, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లోలం సత్యనారాయణ, ఉప సర్పంచ్ రఘునథన్ రాము మాట్లాడుతూ.. డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ (డి) నుండి ఇందల్ వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామం వరకు ఉన్న బిటి రోడ్డు ను పునరుద్ధరణ చేయాలని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దానిలో భాగంగానే రెండు కోట్ల నలభై లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ రోడ్డు నుండి డిచ్‌పల్లి, ఇందల్‌వాయి, ధర్పల్లి మండలాలకు రాకపోకలు సాగించే వారికి దూరాభారంతగ్గడంతో పాటు సమయం కుడా తగుతుందని తెలిపారు. ఈసందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చిన్నవాల్గోట్ గ్రామంలో గురువారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. సర్పంచ్ బొబ్బిలి రాజు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ఇంటి వద్ద ఐదు మొక్కలు నాటుకోవాలని, వాటిని సంరక్షించుకునే బాధ్యత కూడా వారిదేనని తెలిపారు. హరితహారంలో భాగంగా బృహత్ పల్లె ప్రకృతి వనాలు, గ్రామాల్లో చెరువు కట్టలపై, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటడం వలన ఈరోజు వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, కావున ప్రతి ఒక్కరు తమ గురుతర బాధ్యతగా మొక్కలను నాటాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోగుమోహన్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ రొండ్ల గోవర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శరణ్య, కారోబార్ సాయిరాం గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేటి వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం వాయిదా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న జిల్లా టిఎన్జీవో భవన్, ఎన్టీఆర్ చౌరస్తా నిజామాబాద్‌లో జిల్లా ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకుల, ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల (పిడి, పిఈటి లు) సమావేశం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిన సందర్భంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి దుర్గా ప్రసాద్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.సంగీతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశ తేదీలను త్వరలో తెలియజేస్తామని అన్నారు.

భారత్ మాతాకీ జై కాదు..

మణిపూర్ మహిళలను కాపాడండి : సీపీఐ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

భారత్ మాతాకీ జై అని నినదించడం కాదు.. మణిపూర్‌లో మహిళలను కాపాడండి అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ నాయకులు కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. దేశంలో బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పాలన చూడలేక పోతున్నామని, బిజెపి కూటమి అధికారంలో ఉన్న మణిపూర్ రాష్ట్రంలో దాదాపు నాలుగు నెలలుగా జరుగుతున్న కేంద్ర, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాలు అల్లర్లను ఆపలేకపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి అల్లర్లను ఆపాలని, బేటి బచావో, బేటి పడావో, భారత్ మాతాకీ జై అని నినాదాలు ఇచ్చే బిజెపి మహిళలపై జరుగుతున్న దారుణాలను అరికట్టలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న మణిపూర్లో మహిళలను నగ్నంగా ఊరేగించడం, మహిళలపై వికృత చేష్టలు చేయడం భారతమాతను అవమానించడమే అవుతుందని అన్నారు. వెంటనే నిందితులను పట్టుకొని ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పి.రంజిత్ కుమార్, బి.రఘురాం, అంజలి, కుషాల్, బాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా నియమితులైన మంద మకరంద్ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తని గురువారం వారి నివాసంలో మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో ఎలాంటి సమస్యలున్నా తక్షణమే ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎలాంటి సహకారం కావాలన్నా తాను కూడా అందుబాటులో ఉండి తీర్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

రెవెన్యూ అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి. యాదిరెడ్డి పదవీబాధ్యతలు చేపట్టిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి టీఎస్ డబ్ల్యు సిడిసి చైర్‌పర్సన్, ఆకుల లలిత రాఘవేందర్, మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మీ బంటు నిర్మల శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీని కలిసిన బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్ లో ఎమ్మెల్సీ సురభి వాణి, పీవీ ప్రభాకర్ రావును బ్రాహ్మణ సంక్షేమ సంఘం నిజామాబాద్ శాఖ సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నిజామాబాద్ లో ని హైదరాబాద్ రోడ్ లో బోర్గాం పి చౌరస్తా లో పీవీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానించామని బ్రాహ్మణ సంక్షేమ సంఘం నిజామాబాద్ శాఖ సభ్యులు తెలిపారు. తప్పక వస్తామని చెప్పారని అన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు గురువారం సమీకత జిల్లా కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డిని ఆయన చాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో రెడ్ క్రాస్ ప్రతినిధులు బుస్స ఆంజనేయులు, తోట రాజశేఖర్ తదితరులు ఉన్నారు..